సాక్షి ఖమ్మం

సోమవారం । 20 । నవంబర్ । 2023



అప్పడే స్వేచ్ఛాయుత సమాజం..

విలువల వ్యవస్థీకరణ జరిగితేనే స్వేచ్ఛాయుత సమాజం ఆవిష్కృతమవుతుందని ప్రొఫెసర్ హరగోపాల్ అభిప్రాయపడ్డారు. 12లో



రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం వద్ద జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. 10లో

గరిష్టం / కనిష్టం 34° / 22°

వాతావరణం

జిల్లాలో సోమవారం చలి ప్రభావం పెరిగే అవకాశముంది. మధ్యాహ్నం ఎండగా ఉన్నా సాయంత్రానికి చలి మొదలవుతుంది.

గులాబీ సత్తా చాటండి

- ప్రతి ఒక్కరూ తామే అభ్యర్థులుగా భావించాలి
- అన్ని స్థానాల్లోనూ విజయానికి కార్యకర్తలు కృషి చేయాలి
- సింగరేణిని రక్షించేది బీఆర్ఎస్ ప్రభుత్వమే
- తెలంగాణ తొలి ఉద్యమానికి కొత్తగూడెమే నాంది
- రోడ్‌షో, కార్నర్ మీటింగుల్లో ఐటీ మంత్రి కేటీఆర్







ఇల్లెందు రోడ్‌షోకు హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు (పైన) రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, పక్కన అభ్యర్థి హరిప్రియ, ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, మాలోతు కవిత తదితరులు... (కింద) కొత్తగూడెం రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, పక్కన అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు, ఎంపీ నామా తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎవరికి వారు తామే అభ్యర్థులుగా భావించి రాబోయే పది రోజులు కష్ట పడాలని, జిల్లాలో ఈ ఎన్నికల్లో గులాబీ సత్తా చాటాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. జిల్లాలోని కొత్తగూడెం, ఇల్లెందు, అశ్వారావుపేట, భద్రాచలంలో ఆదివారం ఆయన రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగూడెంలో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. నిరంతర విద్యుత్, తాగు, సాగునీరు, సంక్షేమం, సింగరేణి పరిరక్షణ కావాలంటే ఇక్కడ వనమా గెలవడం, రాష్ట్రంలో కేసీఆర్ సీఎం కావడం అనివార్యమని అన్నారు. జిల్లాలో కొన్నిచోట్ల పోడు భూముల సమస్య ఉందని, దాన్ని కూడా పరిష్కరిస్తామని అన్నారు. అంబ సత్రం భూముల సమస్య పరిష్కరించడంతో పాటు గిరిజనేతరులకూ పోడుపట్టాలు అందజేస్తామని అన్నారు. 1/70 సమస్యపై కూడా సీఎం కేసీఆర్ మంచి నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. రేగళ్ల రైతుల సమస్య, పెండింగ్‌లో ఉన్న విమానాశ్రయ సాధన వంటి వాటికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

వనమా చెప్పింది జీవిత సత్యం

కేసీఆర్ చేతుల్లోనే ఈ రాష్ట్ర భవిష్యత్ సుభిక్షంగా ఉంటుందని సీనియర్ నాయకుడు వనమా వెంకటేశ్వరరావు చెప్పిన మాటలు జీవిత సత్యమని మంత్రి కేటీఆర్ అన్నారు. సర్పంచ్ స్థాయి నుంచి మంత్రి వరకు ఎదిగిన నాయకుడు వనమా అన్నారు. 50 ఏళ్ల రాజకీయ అనుభవంతో వనమా ఈ మాటలు అన్నారని కేటీఆర్ చెప్పారు.

బీఆర్ఎస్‌తోనే సింగరేణికి రక్షణ

సింగరేణి రక్షణ గులాబీ జెండాతోనే జరుగుతుందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. మొదట తెలంగాణ ఉద్యమం కొత్తగూడెంలోనే ప్రారంభమైందని గుర్తుచేశారు. ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ సాధించడంలో కొత్తగూడెం ప్రజలు కూడా కీలకపాత్ర పోషించారని కొనియాడారు. చైతన్యవంతమైన సింగరేణి కార్మికులు మరోసారి ఇక్కడ గులాబీ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కొత్తగూడెం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎం చేయాలని కోరారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో కేసీఆర్ వంటి నాయకుడిని చూడలేదని చెప్పారు. కొత్తగూడెం ప్రజలు తనను మరోసారి దీవించాలని, కారుగుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. మొదట బీఆర్ఎస్ కార్యకర్తలు క్రేన్ సాయంతో భారీ గజమాలను కేటీఆర్‌కు వేశారు. అనంతరం జరిగిన కార్నర్ మీటింగ్‌తో సూపర్‌బజార్ సెంటర్ జనాలతో కిక్కిరిసిపోయింది. కార్యక్రమంలో ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు ఎడవల్లి కృష్ణ, కోనేరు సత్యనారాయణ, జేవీఎస్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

స్కాములతో రాష్ట్రాన్ని మింగేస్తారు..

- కాంగ్రెస్ నేతలపై మంత్రి కేటీఆర్ విమర్శ
- హరిప్రియను గెలిపించాలని పిలుపు

ఇల్లెందు: 'రాష్ట్రంలో 11 సార్లు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 45 ఏళ్లు పాలించింది. ఇన్నాళ్లూ ఏమీ చేయకుండా ఇప్పుడు మరో చాన్స్ ఇవ్వాలని అంటోంది. ఆ పార్టీ అధికారంలోకి వస్తే నాయకులు స్కాములు చేస్తారు.. రాష్ట్రాన్ని మింగుతారు' అని రాష్ట్ర మంత్రి కేటీఆర్ హెచ్చరించారు. ఇల్లెందు బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియ విజయాన్ని కాంక్షిస్తూ పట్టణంలో రోడ్ షో నిర్వహించారు. అనంతరం జగదాంబా సెంటర్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ.. ఎన్నికలంటే ఆగం కావొద్దని, జాగ్రత్తగా ఆలోచించి ఓటు వేయాలని అన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ మీద కేసీఆర్‌కు ఉన్న ప్రేమ మోదీకి లేదన్నారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ కోసం రాహుల్‌గాంధీ ఏనాడూ పార్లమెంట్‌లో మాట్లాడలేదన్నారు. సింగరేణి లాభాల్లో బోనస్ ఇప్పించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని చెప్పారు. స్థానిక పార్టీలో చిన్న చిన్న మనస్పర్థలు, అలకలు ఉన్నా అన్నీ సర్దుకుంటాయని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియను అఖండ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. హరిప్రియ మరోసారి ఎమ్మెల్యే కాగానే, రెండు కొత్త మండలాలు ఏర్పాటు చేస్తామని, అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ మంత్రిగా ఉన్న తనతో సోదరి హరిప్రియ కొట్లాడి నిధులు తెచ్చుకుని ఇల్లెందు మున్సిపాలిటీని అభివృద్ధి చేసిందని చెప్పారు. పూసపల్లి ఓసీతో కార్మికులను తరలిస్తారనే అపోహ అవసరం లేదని, ఏ ఒక్కరినీ ఇక్కడి నుంచి తరలించబోమని అన్నారు. ఎమ్మెల్యే హరిప్రియ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎన్నో ఏళ్ల కలలను నెరవేర్చుకున్నామని, బస్ డిపో, 100 పడకల ఆస్పత్రి, సీసీ రోడ్లు, సీతారామ ప్రాజెక్టును సాధించుకున్నామని తెలిపారు. ఈ ప్రాంత గిరిజనులకు పోడు పట్టాలు ఇచ్చిన సీఎం కేసీఆర్ వారి జీవితాలను మార్చారని కృతజ్ఞతలు తెలిపారు. మళ్లీ అధికారంలోకి రాగానే కొమురారం, బోడు మండలాలు ఏర్పాటు చేయాలని, ఇల్లెందును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరారు. ఇవన్నీ కావాలంటే వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటేసి తనను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీలు మాలోతు కవిత, వద్దిరాజు రవిచంద్ర, నాయకులు దిండిగాల రాజేందర్, మడత వెంకట్‌గౌడ్, ఊకె అబ్బయ్య, భాస్కర్ నాయక్, వెంకటప్రవీణ్‌నాయక్, జానీపాషా తదితరులు పాల్గొన్నారు.

హ్యాట్రిక్ విజయం పక్కా..

- 'మెచ్చా'ను మరోసారి ఆశీర్వదించండి
- అశ్వారావుపేట రోడ్‌షోలో కేటీఆర్

అశ్వారావుపేట: తెలంగాణ సీఎంగా కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టడం పక్కా అని మంత్రి కేటీఆర్ అన్నారు. అశ్వారావుపేటలో ఆదివారం నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడుతూ.. కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రంలోనే అత్యధికంగా అశ్వారావుపేట నియోజకవర్గంలో 25,957 ఎకరాల పోడు భూములకు ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరరావు పట్టాలు సాధించారని, అశ్వారావుపేట అభివృద్ధిలో దూసుకుపోతోందని అన్నారు. 80 శాతం గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించామని, ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ సామర్థ్యాన్ని పెంచుకున్నామని, ఆస్పత్రిని 100 పడకలకు విస్తరించామని, 48 తండాలను పంచాయతీలుగా చేశామని వివరించారు. దమ్మపేటలో కోర్టు ఏర్పాటు చేశామన్నారు. మెచ్చా నాగేశ్వరరావు చేస్తున్న అభివృద్ధి చూసి మరోసారి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. 2014కు ముందు, ఆ తర్వాత అశ్వారావుపేటలో వచ్చిన వ్యత్యాసాన్ని గమనించి ఓట్లేయాలన్నారు. 24 గంటలు కరెంట్ ఇవ్వడం లేదని రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నాడని, కాంగ్రెస్ వాళ్లకు రెండు బస్సులు పెడతాం.. బిర్యానీ కూడా తినిపిస్తాం.. ఏ ఊరికైనా వెళ్లి కరెంటు తీగలను పట్టుకోమనండి.. దరిద్రం వదిలిపోతుందని అన్నారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాగానే వినాయకపురం, పట్వారిగూడెం మండలాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అశ్వారావుపేటను మున్సిపాలిటీ చేస్తామని చెప్పారు. ఆయిల్‌పామ్‌కు మద్దతు ధర కల్పిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీలు బండి పార్థసారధిరెడ్డి, నామా నాగేశ్వరరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'గులాబీవనం'లో భద్రాచలం చేరాలి

- తెల్లంను గెలిపించండి.. భద్రాద్రి ప్రజలు కోరిందల్లా చేస్తా

భద్రాచలం: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీఆర్ఎస్ గులాబీవనంలో భద్రాచలం కూడా చేరాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. భద్రాచలంలో జరిగిన రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. 2014, 2018 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో ఒకే సీటు రావడం బాధాకరమన్నారు. అయితే, ఈసారి కూడా కేసీఆర్ సీఎం కావడం, రాష్ట్రంలో గులాబీ విప్లవం ఖాయమని.. ఆ సైన్యంలో భద్రాచలం ఎమ్మెల్యేనూ చేర్చాలని పిలుపునిచ్చారు. భద్రాచలం అభివృద్ధికి సీఎం కేసీఆర్ కట్టుబడి ఉన్నందునే గిరిజనులకు 16 వేల ఎకరాలకు పోడు పట్టాలు ఇచ్చి, గోదావరి వరదల నుంచి కాపాడేలా కరకట్ట పొడిగింపునకు రూ.38 కోట్లతో టెండర్ ఖరారు చేశారన్నారు. కాగా, సీతమ్మసాగర్ ప్రాజెక్టుపై స్థానిక ఎమ్మెల్యే కోర్టులో కేసు వేయడమేకాక డంపింగ్ యార్డు నిర్మాణాన్నీ అడ్డుకున్నారని ఆరోపించారు. ఇలాంటి కారణాలు, కొద్దిపాటి గ్యాప్‌తో భద్రాచలాన్ని అభివృద్ధి చేయలేకపోయామని, తమపై విశ్వాసంతో వెంకట్రావ్‌ను గెలిపించాలని కోరారు.

రాముడిపై భక్తిలేకపోవడమేంటి?

'నా పేరే తారక రాముడు, మా ఇంట్లో రాముడిపై భక్తిలేకపోతే ఈ పేరెందుకు పెడతారు' అని కేటీఆర్ ప్రశ్నించారు. మళ్లీ ప్రభుత్వం ఏర్పడగానే రాముడిని దర్శించుకోవడమే కాక యాదాద్రి తరహాలో భద్రాద్రిని అభివృద్ధిని చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల కోరిక మేరకే గ్రామపంచాయతీలను ఏర్పాటుచేస్తామన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావ్, ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ తాతా మధు, విప్ రేగా కాంతారావు తదితరులు పాల్గొన్నారు.



భద్రాచలం రోడ్‌షోకు హాజరైన జనం

న్యూస్‌రీల్

ఏ మాత్రం ఏమరపాటుగా ఉండొద్దు



బ్రిజేష్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న అధికారులు

నేలకొండపల్లి: సరిహద్దు దాటి మద్యం, నగదు, ఇతరత్రా ఏవీ రాకుండా పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలని ఎన్నికల పరిశీలకుడు, ఐపీఎస్ అధికారి బ్రిజేష్‌కుమార్‌రాయ్ సూచించారు. నేలకొండపల్లి మండలంలోని అంతర్రాష్ట్ర, జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. పైనంపల్లి, కొంగర క్రాస్‌రోడ్డు చెక్‌పోస్టులను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించాక నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌ను కూడా తనిఖీ చేసి అధికారులతో సమావేశమయ్యారు. కూసుమంచి సర్కిల్‌లో శాంతిభద్రతల పరిస్థితిని తెలుసుకున్నారు. సమస్యాత్మక గ్రామాల్లో నిఘా పెంచాలని, చెక్‌పోస్టుల వద్ద ఉద్యోగులు అప్రమత్తంగా ఉంటూ ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని ఆదేశించారు. కూసుమంచి సీఐ కె.జితేందర్, నేలకొండపల్లి ఎస్సై బి.సతీష్, ఏఎస్సై కె.కోడేశ్రాచు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి నిత్యకల్యాణ వేడుక ఆదివారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సెలవు రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, గోదావరి తీరంలో సందడి వాతావరణం నెలకొంది.

పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు



పెద్దమ్మతల్లిని దర్శించుకుంటున్న ప్రసాదరావు తదితరులు

పాల్వంచ : మండలంలోని శ్రీ కనకదుర్గ (పెద్దమ్మతల్లి) అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. సెలవు రోజు కావడంతో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పసుపు, కుంకుమ, చీర, సారెతో పాటు ఒడిబియ్యం, బోనాలు, తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ రేంజ్ ఆఫీసర్ ప్రసాదరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రజినీకుమారి, , ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీనివాస రెడ్డి, గంధం వెంగళరావు, వెంకటరామారావు తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో ఐదు తరాల అభివృద్ధి

రోడ్డు షోలో పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంఅర్బన్: గడిచిన ఐదు సంవత్సరాల్లో ఖమ్మం నియోజకవర్గాన్ని ఐదు తరాలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేశానని బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. ఖమ్మంలోని 8వ డివిజన్ వైఎస్సార్ నగర్, ఎల్‌బీ నగర్, గోపాలపురం ప్రాంతాల్లో ఆదివారం ఆయన రోడ్ షో నిర్వహించారు. ఈసందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ తాను చేసిన అభివృద్ధితో ఖమ్మం ప్రాంతంలో ఆస్తుల విలువ గణనీయంగా పెరిగిందని తెలిపారు. తద్వారా ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి సాధించారని చెప్పారు. రాష్ట్రంలోనే ఖమ్మంను అగ్రభాగాన నిలపాలన్న తపనతో అనునిత్యం కృషి చేశానని, ప్రజలకు అండదండగా నిలిచిన తనను మరోమారు గెలిపించాలని కోరారు. కాగా, తాను మంత్రిగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధిని ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు ఆయన చేసినట్లుగా తప్పుడు ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇక్కడ జరిగిన అభివృద్ధికి కారణం ఎవరు, ఎవరు నిధులు తెచ్చారు అనేది ప్రజలకు తెలిసినందున ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. కాగా, కేసీఆర్ ఇచ్చిన నిధులను నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులకు వెచ్చించానని, ఎక్కడా రాజకీయాలను రానివ్వలేదని తెలిపారు. కానీ ఎన్నికలు రాగానే వచ్చిన కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి వారికి తగిన గుణపాఠం చెప్పాలని అజయ్ పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో నాయకులు గొల్లపూడి హరికృష్ణ, రాంప్రసాద్, వాంకుడోత్ సురేష్, లకావత్ బాలాజీ, భూక్యా అశోక్, నర్సింహ, శివ, సైదులు, భద్రం తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మం 8వ డివిజన్ రోడ్‌షోలో మాట్లాడుతున్న పువ్వాడ అజయ్‌కుమార్



డమ్మీ ఈవీఎంపై గుర్తును చూపిస్తున్న పువ్వాడ

ఇదీ మన గుర్తు...

'ఇది ఈవీఎం.. ఇందులో మన గుర్తు ఇక్కడ ఉంటుంది, నా ఫొటో, కారు గుర్తు పక్కన నొక్కితే ఓటు పడుతుంది' అని పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. ప్రచారంలో భాగంగా ఆయన డమ్మీ ఈవీఎంలను చూపిస్తూ ఓటర్లకు వివరించారు.

జంగ్ తెలంగాణ

బహుజనులకే రాజ్యాధికారం

- ఈ ఎన్నికల తర్వాత జరిగేది అదే...
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్




రోడ్‌షోలో మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, పక్కన అభ్యర్థి రాంబాబు, నాయకులు

వైరా: ఈనెల 30న జరిగే ఎన్నికల తర్వాత బహుజనుల చేతికి రాజ్యాధికారం రావడం ఖాయమని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. బీఎస్పీ వైరా అభ్యర్థి బానోత్ రాంబాబునాయక్ విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం ఆయన రోడ్ షో నిర్వహించారు. అనంతరం వైరా రింగ్ రోడ్ సెంటర్‌లో ప్రజలను ఉద్దేశించి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ అధికారంలోకి రాగానే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని వెల్లడించారు. మహిళలందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేసి, ఉద్యోగావకాశాలు కల్పించడమే కాక ఇంటికొక వాషింగ్ మిషన్ ఉచితంగా అందజేస్తామని తెలిపారు. కాగా, ఈ ఎన్నికల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు డబ్బులు విరజిమ్మి ఓట్లు లాగేసుకోవాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అయితే, ఆ డబ్బంతా ప్రజల డబ్బే అయినందున తీసుకుని ఓటు మాత్రం బీఎస్పీకే వేయాలని కోరారు. ఖమ్మం జిల్లాలో గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. అధికార పార్టీ వెనక ధనబలం ఉంటే తమ వెనక జన బలం ఉన్నందున గెలుపు ఖాయమని ప్రవీణ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ మేకతోటి పుల్లయ్య, నాయకులు ఉదయ్, ఉపేందర్, బానోత్ రజినీబాయి, శరత్‌బాబు, ప్రవీణ్‌కుమార్, శ్రీనాథ్, నరేష్, నిర్మల, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా రాయ'బేరాలు'!

అసంతృప్తులకు వల విసురుతున్న పార్టీలు

- ఇతరులను చేర్చుకునేందుకు ప్రత్యేక కమిటీలు
- కండువాలు మార్చేస్తున్న నేతలు, కార్యకర్తలు



ఇల్లెందురూరల్: అసెంబ్లీ ఎన్నికలకు సమయం సమీపిస్తుండగా రాయ'బేరాలు' ముమ్మరం అవుతున్నాయి. అన్ని పార్టీలు ఓటర్లను ప్రసన్నం చేసుకునే ప్రక్రియ ఓ వైపు కొనసాగిస్తూనే ఇతర పార్టీల్లోని అసంతృప్త నేతలు, కార్యకర్తలను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి. ఇందుకోసం ప్రత్యేకంగా కమిటీలు వేసి మరీ జంపింగ్‌లను ప్రోత్సహిస్తుండటంతో ఎవరు.. ఏ పూట.. ఏ పార్టీలో ఉంటారో చెప్పలేని పరిస్థితి నెలకొంది.

అసంతృప్తులపై నజర్..

అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి మరో వారం రోజులు మాత్రమే గడువు ఉండడంతో ప్రధాన రాజకీయ పార్టీలు ప్రత్యర్థి పార్టీల బలాలు, బలహీనతలను లెక్కలేస్తున్నాయి. తమ పార్టీ బలాన్ని చూపించడానికి ప్రత్యర్థి పార్టీ నుంచి తమవైపు ఆకర్షితులయ్యే వారు ఎవరైనా ఉన్నారా అంటూ వెదుకులాడుతున్నాయి. ఇందుకోసం వారి స్థాయిని, హోదాను బట్టి డబ్బు ముట్టజెపుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఆయా పార్టీల్లో టికెట్ దక్కని అసంతృప్తుల వైపు ప్రత్యర్థి పార్టీలు దృష్టి సారిస్తున్నాయి. తాము అధికారంలోకి వస్తే ఏదో ఒక పదవి ఇస్తామని, లేదంటే పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇస్తున్నాయి. ఇలా అన్ని పార్టీలూ జంపింగ్‌లను ప్రోత్సహిస్తుండటంతో వివిధ పార్టీల్లోని అసంతృప్త నేతలు, కార్యకర్తలు పక్క చూపులు చూస్తున్నారు. దీంతో కండువాలు మారడం చకచకా జరిగిపోతోంది.

ప్రజాప్రతినిధుల వలసల జోరు..

సాధారణంగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు అప్పటివరకు తాము కొనసాగిన పార్టీ విజయం కోసం ఎన్నికల సమయంలో శ్రమించడం సహజం. కానీ తాజా ఎన్నికల సమయంలో సాధారణ కార్యకర్తలు, నాయకుల కంటే ప్రజాప్రతినిధుల వలసలే అధికంగా కనిపిస్తున్నాయి. ఇల్లెందు నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు కండువాలను సులువుగా మార్చేసుకుంటున్నారు. ఇందుకోసం ఆయా పార్టీలు వలస వచ్చే ప్రజాప్రతినిధులకు ప్రత్యేకంగా ప్యాకేజీలు కట్టబెడుతున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. దీంతో ఇటు నుంచి అటు.. అటు నుంచి ఇటు జంపింగ్‌లు సర్వసాధారణంగా మారుతున్నాయి.

ఎప్పుడే కండువాతో కనిపిస్తారో..

ప్రత్యేక కమిటీల ద్వారా ఇతర పార్టీల నుంచి వలసలను ప్రోత్సహిస్తున్న అభ్యర్థులు అంతే స్థాయిలో ఇతర పార్టీల్లోకి వెళ్లిన నేతలను తిరిగి తమ పార్టీలోకి రప్పించేందుకు ప్రత్యేక బృందాలతో ప్రయత్నాలు చేస్తున్నారు. వారిలో కొంత అంగబలం ఉన్న నేతలను గుర్తించి.. తగిన హామీలిస్తూ తిరిగి సొంత గూటికి తీసుకొస్తున్నారు. దీంతో కొందరు నేతలు ఉదయం ఒక కండువాతో, సాయంత్రం మరో కండువాతో దర్శనమిస్తున్నారు.

అభ్యర్థులపై దృష్టి

అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు, నియోజకవర్గ స్థాయి నాయకులు క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధులు, నాయకులను తమపార్టీలోకి చేర్చుకుంటూ వలసలను ప్రోత్సహిస్తుండగా ఆయా పార్టీల అగ్రనాయకత్వాలు మాత్రం ఎమ్మెల్యే అభ్యర్థులుగా నామినేషన్ వేసిన నేతలపై దృష్టి సారిస్తున్నారు. ఇలా ప్రధాన పార్టీల నుంచి టికెట్ ఆశించి భంగపడ్డ నాయకుల్లో కొందరు వలసలకు ప్రాధాన్యమిస్తున్నారు. ఇంతకాలం తాము నమ్ముకున్న పార్టీ నుంచి టికెట్ దక్కకపోవడంతో పార్టీ మారితే భవిష్యత్‌లో మంచి అవకాశం రాకపోతుందా అనే ఆశతో మరి కొందరు నిర్ణయం తీసుకుంటున్నారు.

లాభనష్టాలు షరామామూలే..

అసెంబ్లీ ఎన్నికల వేళ ఇతర పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులను తమ పార్టీలోకి చేర్చుకుంటున్న నాయకులకు అది కూడా తలనొప్పిగానే మారుతోంది. అప్పటివరకు పార్టీనే నమ్ముకొని పనిచేసిన తమను కాదని ఇతర పార్టీల నుంచి వచ్చిన వారి పెత్తనం తమపై ఏంటని పలువురు నేతలు, కార్యకర్తలు తిరుగుబాటు చేస్తున్నారు. దీంతో వారిని సముదాయించడం నాయకత్వానికి సమస్యగా మారుతోంది. ఏదేమైనా తాజా వలసలు పార్టీలకు ఎంత మేర మేలు చేస్తాయో, ఏ మేరకు నష్టపరుస్తాయోనని అభ్యర్థులు భయపడుతుండగా లాభనష్టాలు షరా మామూలేనని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

రోడ్‌షో సైడ్‌లైట్స్

- భద్రాచలం నుంచి 2.14కు హెలీకాప్టర్ ఇల్లెందుకు చేరుకుంది
- 2:20 గంటలకు సింగరేణి మైదానం నుంచి మంత్రి కేటీఆర్ రోడ్‌షో ప్రారంభమైంది.
- ఇల్లెందులో 24 నిమిషాలపాటు కార్యక్రమం కొనసాగింది.
- జగదాంబసెంటర్‌లో 11 నిమిషాలపాటు మంత్రి కేటీఆర్ ప్రసంగించారు.
- 3:10 గంటలకు హెలికాప్టర్ కొత్తగూడెం బయలుదేరింది.
- వరల్డ్ కప్ జరుగుతున్న నేపథ్యంలో క్రికెట్ స్టార్‌ల పరుగులు, వికెట్లను ఉదహరిస్తూ కేటీఆర్ ప్రసంగం ప్రారంభించారు.

– ఇల్లెందురూరల్

రోడ్ షోలో జేబు దొంగ

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఆదివారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. మీటింగుకు హాజరైన దుమ్ముగుడెం మండలం బందిరేవు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ బీసీ సెల్ నాయకుడు కొమ్ము రంజిత్ కుమార్ నుంచి రూ.40 వేల నగదును జేబు దొంగలు కాజేశారు. దీనిపై బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

మహిళకు అస్వస్థత


అస్వస్థతకు గురైన మహిళ

భద్రాచలం అర్బన్: కేటీఆర్ రోడ్ షో కార్యక్రమానికి బీఆర్‌ఎస్ నాయకులు వాజేడు, వెంకటాపురం, చర్ల, దుమ్ముగూడెం మండలాల నుంచి ఆదివారం ఉదయమే ప్రజలను ఆటోలు, వ్యాన్లలో తీసుకొచ్చారు. రోడ్ షోకు వచ్చిన దుమ్ముగూడెం మండలానికి చెందిన పార్వతి అనే మహిళ స్పృహతప్పి పడి పోయింది. ఉదయం 11 గంటలకు జరగాల్సిన కార్యక్రమం కేటీఆర్ రాక ఆలస్యం కావడం, ఎక్కువ సమయంలో ఎండలోనే ఆమె కళ్లు తిరిగి పడిపోయింది. వెంటనే బంధువులు, స్నేహితులు సమీప ఆస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్స అందించారు.


సారపాకలో కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న ప్రభుత్వ విప్ కాంతారావు తదితరులు


ఇల్లెందు రోడ్‌షోలో సందర్భంగా పార్టీ శ్రేణుల బైక్ ర్యాలీ

తరలివచ్చిన గులాబీ శ్రేణులు


కొత్తగూడెం రోడ్డు షోకు హాజరైన పార్టీ శ్రేణులు

రాష్ట్ర మంత్రి కేటీఆర్ ఆదివారం జిల్లాలో నిర్వహించిన రోడ్ షో కార్యక్రమానికి బీఆర్‌ఎస్ శ్రేణులు కదిలివచ్చాయి. భద్రాచలం, అశ్వారావుపేట, ఇల్లెందు, కొత్తగూడెం నియోజకవర్గాల్లో ఆయన రోడ్ షో నిర్వహించారు. పార్టీ, అభిమానులు కార్యకర్తలు నృత్యాలు, బోనాలు, బతుకమ్మలతో అలరించారు. సారపాకలో కేటీఆర్‌కు ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, పలువురు నాయకులు స్వాగతం పలికారు.

–సాక్షి నెట్‌వర్క్


కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న జేవీఎస్.చౌదరి


అశ్వారావుపేటలో మాట్లాడుతున్న కేటీఆర్, పక్కన ఎంపీ నామా, ఎమ్మెల్యే మెచ్చా తదితరులు


కొత్తగూడెంలో కళాకారులతో కలిసి నృత్యం చేస్తున్న వనమా వెంకటేశ్వరరావు


భద్రాచలంలో మాట్లాడుతున్న కేటీఆర్, పక్కన ఎంపీ కవిత, మధు, కాంతారావు, వెంకట్రావు


ఇల్లెందు రోడ్‌షోకు బతుకమ్మలు, బోనాలతో హాజరైన మహిళలు


ఇల్లెందులో బైక్‌పై బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఏసీపీ రమణమూర్తి

జంగ్ తెలంగాణ

● ఏ మాత్రం ఏమార్చలేరు !


నేలకొండపల్లిలో ర్యాలీని చిత్రీకరిస్తున్న వీడియోగ్రాఫర్

ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ఎన్నికల సంఘం నిబంధనలను తప్పక పాటించాల్సి ఉంటుంది. అలాగే, ప్రతీ ఖర్చును అధికారులకు సమర్పించాలి. ఇందులో భాగంగా ఎవరూ ఏ అంశాన్ని విస్మరించకుండా అధికారులు వీడియోలు తీయిస్తున్నారు. ప్రతీ అభ్యర్థి ర్యాలీ, ఇతరత్రా కార్యక్రమాలను వీడియో చిత్రీకరిస్తారు. ఈ వీడియోలను పరిశీలించి, అభ్యర్థులు సమర్పించిన వివరాల్లో తేడా ఉంటే సరిచేస్తారు. ఇందుకోసం నియమితులైన సిబ్బంది వీడియో చిత్రీకరణలో నిమగ్నమయ్యారు.

– నేలకొండపల్లి

వాట్సాప్ వార్ !

- రోజూ వందల సంఖ్యలో పోస్టులు
- గ్రామాలు, వార్డుల వారీగా గ్రూప్‌లు.. కార్యకర్తల జోరు
- బేజార్ అవుతున్న సామాన్య ప్రజలు



వైరా: వాట్సాప్.. ఈ యాప్ తెలియని మొబైల్ వినియోగదారులు ఉండరనే చెప్పాలి. ఇంతటి ప్రాచుర్యం పొందిన యాప్ కావటంతోనే ఎన్నికల వేళ దీన్ని కార్యకర్తలు విరివిగా వినియోగిస్తున్నారు. ప్రతీచోట కులాలు, వృత్తులు, పార్టీలు, ఇతరత్రా సమూహాల వారీగా గ్రూపులు ఉన్నాయి. ఎన్నికల వేళ ఈ గ్రూప్‌లలో అభ్యర్థులు, పార్టీలకు అనుగుణంగా కార్యకర్తలు పోస్టులు చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా కమిటీలను నియమించడం విశేషం.

విమర్శలు, ప్రతివిమర్శలు

ఒక పార్టీ అభ్యర్థికి అనుకూలంగా వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ పెట్టగానే.. ఎదుటి వర్గం వారు ఇంకో పోస్ట్ పెట్టడం సాధారణమైపోయింది. ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకోవడం, వ్యంగ్యాస్త్రాలు విసరడం దినచర్యగా మార్చుకున్నారు. చాలామంది సొంతంగా రాసి, తయారుచేసిన పోస్టులు పెట్టకపోయినా ఫార్వర్డ్ చేస్తున్న వారు అధికంగా ఉన్నారు. దీనికి తోడు ప్రచార కార్యక్రమాలు, ర్యాలీలు, పార్టీ లో చేరికలు, స్పీచ్‌లతో కూడిన వీడియోలు, ఫొటోలతో గ్రూపులను నింపేస్తున్నారు. ఎన్నికల ముందు వరకు ఈ గ్రూప్‌లలో వ్యవసాయ సంబంధ సమాచారం, ఉద్యోగ నోటిఫికేషన్లు, శుభకార్యాల సమాచారం ఎక్కువగా ఉండేది. ఇప్పుడు ఎన్నికల ఫీవర్ ఉండటంతో పోస్టులు, ప్రతి పోస్టులతో హోరెత్తిస్తున్నారు. తమ పార్టీ గెలుస్తుందని ఒకరు.. కాదు తమ పార్టీదే విజయమని ఇంకొకరు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక్కో గ్రూపులో 500 – 600 పోస్టులు పెడుతుండడం గమనార్హం. దీనికి తోడు వ్యక్తిగత దూషణలకు తెరలేపటంతో అక్కడక్కడా ఉద్రిక్తత పరిస్థితులు నెలకొంటున్నాయి. అయితే, ఈ గ్రూప్‌ల్లోని రాజకీయ ప్రచారంతో సామాన్య ప్రజలకు మాత్రం తలనొప్పి వస్తోంది. ఎన్నికలు ఎప్పుడు ముగుస్తాయో.. ఈ పోస్టుల నుంచి ఎప్పుడు విముక్తి కలుగుతుందా అని వారు ఎదురుచూస్తున్నారు. ఇంకొందరైతే ఇదంతా భరించలేక వాట్సప్ గ్రూపుల నుంచి తప్పుకుంటుండటం గమనార్హం.

ట్రాఫిక్ ఆంక్షలతో రోగులు, సామాన్యులకు అవస్థ


ఆర్టీసీ డిపో ఎదుట రోడ్డుకు అడ్డంగా పెట్టిన బారికేడ్లు

భద్రాచలంఅర్బన్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఆదివారం భద్రాచలంలో రోడ్ షోలో పాల్గొనేందుకు రాగా పోలీసులు పట్టణంలోని ప్రధాన రహదారులను భారీకేడ్లతో మూసివేశారు. దీంతో పట్టణ ప్రజలు, ప్రయాణికులు, అత్యవసర పనులున్న వారు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నాలుగు రాష్ట్రాలకు వారిధిగా ఉన్న భద్రాచలం పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షల కారణంగా ఈ పరిస్థితి తలెత్తింది. కేటీఆర్ రాక ముందే కొంత సేపు ట్రాఫిక్ జామ్ అయింది.


అంబేద్కర్ సెంటర్‌లో ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న పోలీసు సిబ్బంది

పెద్ద నోటు లేదాయే..!



2014 ఎన్నికల సమయాన రూ.వెయ్యి నోటు భారీ ఎత్తున చేతులు మారింది. ఈ నోటును 2016 నవంబర్ 8న రిజర్వ్ బ్యాంకు రద్దు చేసింది. అనంతరం రూ.2 వేల నోటును చెలామణిలోకి తెచ్చింది. 2018 ఎన్నికల్లో ఈ పెద్ద నోటు అందరి కళ్లలోనూ కాంతులు నింపింది. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు కిందిస్థాయి నాయకులు, ఓటర్లకు పెద్ద ఎత్తున వీటిని పంపిణీ చేశారని చెబుతారు. ఆ తర్వాత ఈ నోటును కూడా కేంద్రం నిలిపి వేయడంతో ప్రస్తుత ఎన్నికల్లో రూ.500 మాత్రమే చెలామణి అవుతోంది. అయితే, భారీగా నగదు తీసుకురావాలన్నా, పంపిణీ చేయాలన్నా రూ.500 నోట్లే అందుబాటులో ఉండటంతో అభ్యర్థులు సమస్య ఎదుర్కొంటున్నట్లు చర్చ జరుగుతోంది!.

– చుంచుపల్లి

క్లుప్తంగా

బంగారం, నగదు పట్టివేత

ఖమ్మంక్రైం: సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న బంగారం, వెండి, నగదును ఖమ్మం త్రీటౌన్ పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం గాంధీచౌక్‌కు చెందిన బంగారు వ్యాపారి షాపు నుంచి ఇంటికి వెళ్లే క్రమంలో బంగారం 84గ్రాములు, 12కిలోల వెండి, రూ.3.75లక్షల నగదు ఉన్నట్లు తనిఖీల్లో గుర్తించారు. అయితే, ఆయన వద్ద సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

ముదిగొండ మండలంలో...

ముదిగొండ: ముదిగొండ మండలంలోని పెద్ద మండవ, వనంవారికిష్టాపురంల్లో ఆదివారం రాత్రి అధికారులు చేపట్టిన తనిఖీల్లో నగదు, మద్యం స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ అధికారులకు అందిన సమాచారంతో ఆయా గ్రామాల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా వనంవారికిష్టాపురంలో రూ.2లక్షల నగదు, పెద్దమండవలో రూ.2లక్షల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

చిన్నకోరుకొండిలో మద్యం.....

కల్లూరురూరల్: కల్లూరు మండలం చిన్నకోరుకొండిలో పోలీసులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఓ బెల్ట్‌షాపులో అక్రమంగా నిల్వ చేసిన రూ.17,130 విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిర్వాహకుడు ఏ.రాంబాబుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రఘు తెలిపారు.

దమ్మపేటలో...

దమ్మపేట: బెల్ట్ షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం సీసాలను పోలీసులు ఆదివారం సీజ్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. దమ్మపేట గ్రామంలోని అర్బన్ కాలనీలో బెల్ట్ షాపులో మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఎస్‌ఐ రవికుమార్ తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 18 క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకున్నారు. మద్యంను సీజ్ చేయడతోపాటు షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వెల్లడించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కారేపల్లి: మానసిక స్థితి బాగా లేని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కారేపల్లి మండలం బోటితండా గ్రామానికి చెందిన గుగులోతు సైదులు(27)కు కొంతకాలంగా మానసిక స్థితి సరిగ్గా లేక ఇబ్బంది పడుతున్నాడు. ఈక్రమంలోనే చికిత్స చేయించుకున్నా ఫలితం లేక జీవితంపై విరక్తి చెందిన ఆయన శనివారం పురుగుల మందు తాగాడు. దీంతో బంధువులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందగా కేసు నమోదు చేసినట్లు కారేపల్లి ఎస్‌ఐ పి.రామారావు తెలిపారు.

● భలే మంచి బేరం !

- పార్టీల కండువాలు, చొక్కాలు, టోపీలకు గిరాకీ..
- ఎన్నికల వేళ జోరుగా సాగుతున్న అమ్మకాలు

సత్తుపల్లిరూరల్: ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యాన వివిధ వృత్తుల్లో ఉన్న వారికి ఉపాధి లభిస్తోంది. ఇదే సమయాన వ్యాపారులకూ గిరాకీ పెరిగింది. ఎన్నికల సమయంలో ఒక పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంకో పార్టీలో చేరడం, తెల్లారికల్లా సొంత గూటికి చేరడం సర్వసాధారణమైపోయింది. దీంతో వీరికి కప్పే పార్టీల కండువాల అమ్మకాలు జోరుగా సాగుతోంది. అంతేకాకుండా ప్రచారంలో పాల్గొనే కార్యకర్తలు కండువాలు, టోపీలు, చొక్కాలను పార్టీ నాయకులే సమకూరుస్తుండడంతో అమ్మకాలు ఊపందుకున్నాయి. డిమాండ్‌కు అనుగుణంగా ఎప్పటికప్పుడు వ్యాపారులు వీటిని అందుబాటులో ఉంచుతున్నారు. అదేవిధంగా రాజకీయ పార్టీల సభల సమయంలోనూ సత్తా చాటాలే హాజరైన వారందరూ పార్టీ రంగు చొక్కా ధరించాలని నాయకులు సూచిస్తున్నారు. ఇందులో కొందరికి నాయకులే వీటిని సమకూరుస్తుండగా.. మరికొందరు సొంతంగా కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా వ్యాపార సంస్థల్లో ఎన్నికల సందడి నెలకొనడంతో వ్యాపారులు సంబరపడిపోతున్నారు.




సత్తుపల్లిలో విక్రయానికి సిద్ధంగా ఉన్న వివిధ పార్టీల కండువాలు, టోపీలు, జెండాలు

దమ్మాయిగూడెం వద్ద రోడ్డు ప్రమాదం

- తీవ్రగాయాలతో ఇద్దరు యువకుల మృతి
- గుంతను తప్పించబోయి లారీ కింద పడడంతో ఘటన


చరణ్ (ఫైల్)


జస్వంత్ (ఫైల్)

తిరుమలాయపాలెం: మండంలోని దమ్మాయిగూడెం వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కాకరవాయి గ్రామానికి చెందిన నల్లగట్ల ఉపేందర్ కుమారుడు జస్వంత్(15), నల్లగట్ల చిరంజీవి కుమారుడు చరణ్(17) ఆదివారం మోటార్ సైకిల్‌పై ఖమ్మం వెళ్లారు. తిరిగి ఇంటికి వెళ్తుండగా దమ్మాయిగూడెం ఫంక్షన్ హాల్ వద్ద రహదారిపై ఉన్న గుంతను తప్పించబోయి ఎదురుగా వస్తున్న లారీ వెనక టైర్ల కింద పడిపోయారు. ఈ ఘటనలో జస్వంత్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, కొన ఊపిరితో ఉన్న చరణ్‌ని ఖమ్మం ఆస్పత్రికి తరలించగా మృతిచెందాడు. వీరిలో చరణ్ ఇంటర్ చదివి పెట్రోల్ బంక్‌లో పనిచేస్తుండగా, జస్వంత్ కాకరవాయి పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో కాకరవాయిలో తీవ్ర విషాదం అలుముకుంది. చేతికి అందిన కుమారుల మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రాణాలు తీసిన గుంత

దమ్మాయిగూడెం రహదారిపై ఏర్పడిన గుంత కారణంగానే ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారని స్థానికులు తెలిపారు. ఖమ్మం నుండి వీరోలు వైపు వెళ్తున్న యువకులు దమ్మాయిగూడెం వద్దకు రాగానే గుంతను తప్పించే క్రమాన వరంగల్ వైపు నుండి ఖమ్మం వస్తున్న లారీ వెనక టైరు కింద పడిపోయారు. ఈ ఘటనలో చరణ్ తల భాగం ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందారు. వీరు ప్రయాణిస్తున్న మోటార్ సైకిల్ ధ్వంసం కావడం ప్రమాద తీవ్రతకు అద్దం పట్టింది.

బస్సును ఢీకొట్టిన లారీ, ఐదుగురికి గాయాలు

ముదిగొండ: మండలంలోని గోకినేపల్లి వద్ద ఆదివారం ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టిన ఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. కోదాడ నుంచి ఖమ్మం వెళ్తున్న బస్సును ఖమ్మం నుంచి కోదాడ వెళ్తున్న లారీ ఢీకొట్టింది. గోకినేపల్లి వద్ద లారీ అతివేగంగా రావడంతో ఈ ప్రమాదంలో జరగగా, బస్సులోని ఐదుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. దీంతో వీరిని 108 వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రెండు బైక్‌లు ఢీకొనడంతో..

బోనకల్: మండలంలోని రావినూతల సమీపాన సమీపంలో ఆదివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా వత్సవాయికి చెందిన మహంకాళి రామారావు ద్విచక్ర వాహనంపై కొత్తగూడెం వెళ్తున్నాడు. ఆయన రావినూతల సమీపంలోకి రాగానే బోనకల్ నుండి నారాయణపురానికి వాహనంపై వెళ్తున్న నర్సింశెట్టి నరేష్, కొత్త బ్రహ్మారావు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. దీంతో వీరిని 108లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కాంగ్రెస్ నుండి మాధవీరెడ్డి సస్పెన్షన్

కూసుమంచి: మండలంలోని పాలేరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకురాలు రామసహాయం మాధవీరెడ్డిని పార్టీ నుంచి ఆరేళ్ల పాటు సస్పెండ్ చేస్తూ క్రమశిక్షణ చర్యల కమిటీ చైర్మన్ జి.చిన్నారెడ్డి ఆదివారం ప్రకటన విడుదల చేశారు. పాలేరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున పొంగులేటి శ్రీనివాసరెడ్డి పోటీ చేస్తుండగా, అధిష్టానం ఆదేశాలను ధిక్కరించి మాధవి పోటీలో ఉండడంతో చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

వంద రోజుల్లో హామీల అమలు

మాజీ ఎంపీ హన్మంతరావు

ఖమ్మంవన్‌టౌన్: కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలన్నింటినీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అమలుచేస్తామని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ వి.హన్మంతరావు స్పష్టం చేశారు. ఖమ్మంలో ఎన్నికల ప్రచారం కోసం ఖమ్మం నుంచి ఆదివారం నుంచి వస్తున్న ఆయనకు మున్నూరు కాపు సంఘం నాయకులు తిరుమలాయపాలెంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వీహెచ్ నాయకులను ఉద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలోని వివరాలతో పాటు అధికారంలోకి రాగానే వంద రోజుల్లో అమలు చేయనున్న అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నాయకులు కొత్తా సీతారాములు, పొదిల రవికుమార్, శెట్టి రంగారావు, చౌడవు నర్సింహారావు, వేణు, సూరిబాబు, జానయ్య, మహ్మద్ జానీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను కొట్టిన హాస్టల్ వర్కర్లు

తల్లిదండ్రుల ఆందోళనతో విధుల నుంచి తొలగింపు


విద్యార్థులతో మాట్లాడుతున్న డీడీ సత్యనారాయణ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలోని ఎస్సీ బాలుర ప్రభుత్వ సంక్షేమ వసతిగృహం(ఆనందనిలయం)లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు చరణ్, నగేష్‌ను హాస్టల్ వర్కర్లు కొట్టడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆదివారం ఉదయం ఆందోళనకు దిగారు. దీంతో విషయం తెలుసుకున్న ఎస్సీ సంక్షేమ శాఖ డీడీ కస్తాల సత్యనారాయణ, ఏఎస్‌డబ్ల్యూఓ శ్రీలత చేరుకుని విచారణ చేపట్టారు. వాచ్‌మెన్ రమేష్, బాలస్వామి విద్యార్థులను కొట్టిన విషయమై వివరాలు సేకరించామని వారు తెలిపారు. అనంతరం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రమేష్‌ను విధుల నుండి పూర్తిగా తొలగించగా, రెగ్యులర్ ఉద్యోగి బాలస్వామిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్‌కు లేఖ రాశామని చెప్పారు. కాగా, విచారణకు వచ్చిన అధికారుల ఎదుట విద్యార్థుల తమ గోడు వెళ్లబోసుకున్నారు. వర్కర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, తరచుగా కొడుతున్నారని వాపోయారు. ఈ విషయమై తల్లిదండ్రులు ఆందోళనకు దిగగా అధికారులు వారికి సర్దిచెప్పారు. ఇప్పటికే వర్కర్లపై చర్యలు తీసుకున్నామని తెలపగా వారు శాంతించారు.

బహుమతి పేరిట రూ.3.64లక్షలు స్వాహా

రఘునాథపాలెం: అమెరికా వాసిగా పరిచయం చేసుకున్న మహిళ బహుమతి పంపిస్తానని నమ్మించి రూ.3.64లక్షలకు పైగా స్వాహా చేసిన ఘటన ఇది. ఈ మేరకు బాధితుడు రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెంకు చెందిన వి.జార్జ్ ఇచ్చిన ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీధర్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. వి.వెంకటాయపాలెం వాసి జార్జ్‌కు ఫేస్ బుక్ ద్వారా అమెరికాకు చెందిన మేరీ డోనైడ్ సంఘ సేవకురాలిగా పరిచయమైంది. కొద్దిరోజుల తర్వాత ఆమె 50వేల డాలర్ల విలువైన బహుమతి పంపిస్తానని చెప్పింది. నిజమేనని నమ్మిన జార్జ్.. పలు దఫాలుగా ఆన్‌లైన్ ద్వారా రూ.3,64,030లు పంపించాడు. అయినా బహుమతి పంపించకపోగా ఇంకా డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేయడంతో మోసపోయినట్లు గుర్తించిన జార్జ్ పోలీసులను ఆశ్రయించాడు.

నల్లగొండలో...



ఖమ్మంలో...



వేములవాడలో...



ఆట చూస్తూ.. అక్షింతలు వేస్తూ..

పెళ్లి వేడుకల్లో క్రికెట్ వీక్షణానికి తెరలు

ఒకవైపు వందల సంఖ్యలో వివాహాలు, మరోవైపు ప్రపంచకప్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ ఆదివారం జరగడంతో అతిథుల కోసం ఎక్కడికక్కడ భారీ తెరలు ఏర్పాటు చేశారు. దీంతో వివాహాలకు హాజరైన వారు.. అటు వధూవరులను ఆశీర్వదించి.. ఇటు మ్యాచ్‌ను తిలకించారు. వేములవాడ, ముదిగొండ, నల్లగొండ ప్రాంతాల్లో జరిగిన వివిధ వివాహ వేడుకల్లో వరల్డ్‌కప్ క్రికెట్ మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు చేశారు.

వేములవాడ/ముదిగొండ/నల్లగొండ



ప్రచారం మాని.. ప్రసారాలు

ఆస్ట్రేలియా – భారత్ మధ్య ఆదివారం జరిగిన క్రికెట్ ప్రపంచ కప్ పోటీ రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారానికి తీవ్ర అంతరాయం కలిగించింది. ప్రధాన పార్టీల అభ్యర్థులు, వారి అనుచరులు, పార్టీ శ్రేణులే కాదు.. స్వతంత్రులు సైతం ఆదివారం మధ్యాహ్నం వరకే ప్రచారం చేశారు. ఆ తర్వాత క్రికెట్ మ్యాచ్ తిలకించడంలో నిమగ్నమయ్యారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

రెండో విడత ఎంబీఏ ప్రవేశాలకు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): ఓయూ క్యాంపస్ కాలేజీలో ఎంబీఏ కోర్సులో మిగిలిన సీట్లకు రెండో విడత ప్రవేశాలకు.. ఉద్యోగులు (ప్రభుత్వ, ప్రైవేటు) దరఖాస్తు చేసుకోవాలని పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ పాండురంగారెడ్డి ఆదివారం తెలిపారు. ఎంబీఏ ఈవెనింగ్ (2 ఏళ్ల టెక్నాలజీ మేనేజ్‌మెంట్), ఎంబీఏ జనరల్ (2 ఏళ్ల ఈవెనింగ్) కోర్సుల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు ఈనెల 22న ఉదయం 11 గంటలకు పీజీ అడ్మిషన్స్ కార్యాలయంలో ఎంట్రన్స్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు 9885622266 ఫోన్‌నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

పగటి పూటా ఓ కునుకేయండి



మధ్యాహ్నం వేళ 15 నుంచి 30 నిమిషాల నిద్రతో ఆరోగ్యానికి ఎంతో మేలు

- వృద్ధాప్య ఛాయలు ఏడేళ్ల వరకు తగ్గింపు
- లండన్ వర్సిటీ, ఉరుగ్వే వర్సిటీ పరిశోధనల్లో వెల్లడి
- నిద్ర లేమితో అల్జీమర్స్, చిత్త వైకల్యం వచ్చే ప్రమాదం
- అధిక నిద్రతోనూ అనారోగ్య సమస్యలు

సాక్షి, అమరావతి: చక్కటి నిద్ర దివ్యౌషధంగా పని చేస్తుంది. అందులోనూ పగటిపూట తీసే చిన్నపాటి కునుకు మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. రోజూ మధ్యాహ్నం 15–30 నిమిషాలు రెప్పవాల్చితే చిత్తవైకల్య ప్రమాదం తగ్గడంతో పాటు వృద్ధాప్య ఛాయలు త్వరగా దరిచేరవని తాజా అధ్యయనంలో వెల్లడైంది. సాధారణ వ్యక్తులతో పోలిస్తే పగటిపూట నిద్రించే వారిలో 2.6–7 సంవత్సరాల వరకు వృద్ధాప్యం నెమ్మదిస్తుంది. యూనివర్సిటీ కాలేజ్ లండన్, ఉరుగ్వేలోని యూనివర్సిటీ ఆఫ్ రిపబ్లిక్ పరిశోధకులు క్రమం తప్పకుండా పగటిపూట నిద్రపోవడం వల్ల మెదడు కుచించుకుపోయే ప్రమాదాన్ని తగ్గిస్తుందని.. చురుకుదనాన్ని ప్రేరేపిస్తుందని తేల్చారు. ఫలితంగా జ్ఞాన సామర్థ్యం, జ్ఞాపక శక్తి పెరుగుతాయని గుర్తించారు. అయితే.. పగటిపూట 90 నిమిషాల కంటే ఎక్కువసేపు నిద్రపోవడం ఆరోగ్యానికి చేటని సూచిస్తున్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి 7 గంటల నిద్ర

సంపూర్ణ ఆరోగ్యానికి సుమారు 7 గంటల మంచి నిద్రను శాస్త్రవేత్తలు, వైద్య నిపుణులు ప్రతిపాదిస్తున్నారు. ఇందుకు విరుద్ధంగా భారత్‌లోని పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రపంచంలో నిద్ర లేమితో బాధపడుతున్న దేశాల్లో భారత్ రెండో స్థానంలో ఉండటం ఆందోళన కలిగిస్తోంది. నిద్ర లేకపోవడం వల్ల కలిగే సమస్య కేవలం అలసట ఒక్కటే కాదని.. తీవ్ర దీర్ఘకాలిక అనారోగ్యానికి దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు. రాత్రిపూట కలతలేని నిద్రతో అలసట, తలనొప్పి, మూడ్ స్వింగ్స్ నియంత్రణలో ఉండి మానసిక ఉత్సాహంతో పని చేస్తారని చెబుతున్నారు. అయితే.. తక్కువ నిద్రపోయే వారిలో అల్జీమర్స్ వచ్చే అవకాశం 40 శాతం ఎక్కువని అధ్యయనం వెల్లడించింది.

అతి నిద్ర ప్రమాదకరం

తక్కువ నిద్రతోనే కాదు.. అతి నిద్రతోనూ ఆరోగ్యానికి ముప్పు పొంచి ఉందని పరిశోధకులు చెబుతున్నారు. రోజంతా అదే పనిగా నిద్రపోతే అధిక రక్తపోటు, స్ట్రోక్‌కు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తేల్చారు. అతి నిద్ర అంతర్లీన నిద్ర రుగ్మతకు సంకేతమని భావిస్తున్నారు. ఈ రుగ్మతతో ఒత్తిడి, బరువును నియంత్రించే హార్మోన్లపై ప్రభావం చూపుతుందని తేల్చారు. ఫలితంగా చిన్న వయసులోనే ఊబకాయం, బీపీ, టైప్–2 డయాబెటిస్, గుండె జబ్బులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

స్క్రీనింగ్ సమయంతోనే ముప్పు

స్క్రీనింగ్ సమయం నిద్రలేమి స్థాయిని పెంచుతుందని అధ్యయనం చెబుతోంది. నిద్రలేమితో బాధపడే వారిలో దాదాపు 54 మంది డిజిటల్, సోషల్ మీడియాను విరివిగా వినియోగిస్తున్నట్టు గుర్తించింది. దాదాపు 87 శాతం మంది భారతీయులు పడుకునే ముందు తమ ఫోన్లను ఉపయోగిస్తుండటంతో తీవ్రమైన నిద్ర సమస్యకు దారితీస్తుందని పేర్కొంది. ఫలితంగా 56 శాతం మంది పురుషులతో పోలిస్తే 67 శాతం మంది మహిళలు పని సమయంలో నిద్రపోతున్నారని వెల్లడించింది. వీలైనంత వరకు మధ్యాహ్నం 2 గంటల లోపు కెఫిన్ ఉండే పదార్థాలను తగ్గించాలని.. మద్యం తాగి నిద్రపోవడం/నిద్రపోయే మూడు గంటల ముందు మద్యం తీసుకోవడం కూడా ఆరోగ్యానికి చేటని సూచిస్తున్నారు. ముఖ్యంగా నిద్రవేళకు దగ్గర సమయంలో వ్యాయామం చేయడం కూడా నిద్రలేమికి కారణంగా భావిస్తున్నారు.

మీరు మా హృదయాలను గెలుచుకున్నారు

- టీమిండియాపై 'ఎక్స్'లో పోస్టు చేసిన ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి



సాక్షి, అమరావతి: ఫైనల్ ఫలితం నిరాశపరిచినా.. ఈ విడత వన్డే ప్రపంచ కప్‌లో భారత్ క్రీడాకారులు దేశానికి కప్ సాధించి పెట్టేందుకు మిగతా అన్ని మ్యాచ్‌లో వారు కనబరిచిన ఆట తీరు ప్రజల హృదయాలను గెలుచుకుందని ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనియాడారు. ట్విట్టర్ (ఎక్స్) ద్వారా సీఎం స్పందిస్తూ.. '2023 క్రికెట్ ప్రపంచ కప్‌లో అద్భుతమైన ప్రయాణం చేసినందుకు భారత క్రికెట్ జట్టులోని క్రీడాయోధులకు నా ప్రశంసలు. ఫైనల్ మ్యాచ్ మనకు అనుకూలంగా జరగనప్పటికీ.. ఈ ప్రయాణంలో వారి స్ఫూర్తి, క్రీడా స్ఫూర్తి, టోర్నీ మొత్తంగా వివిధ సందర్భాల్లో జట్టు సభ్యులు కనబరిచిన అద్భుతమైన ఆట తీరు యావత్ దేశానికి ఎంతో స్ఫూర్తినిచ్చాయి. టీమ్ ఇండియా! మీరు మా హృదయాలను గెలుచుకున్నారు' అంటూ ట్వీట్ చేశారు.

బీఎస్పీ అభ్యర్థి జానయ్యపై దాడికి యత్నం

- అడ్డొచ్చిన అనుచరుడికి గాయాలు.. భూ వివాదాలే కారణం
- ఆత్మకూర్–ఎస్ మండలం గట్టికల్ గ్రామంలో ఉద్రిక్తత



జానయ్య చొక్కాపై రక్తపు మరకలు



గాయపడిన జానయ్య అనుచరుడు

ఆత్మకూర్ –ఎస్(సూర్యాపేట): సూర్యాపేట నియోజకవర్గం నుంచి బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వట్టె జానయ్య యాదవ్‌పై ఓ వ్యక్తి తన ఇద్దరు కుమారులతో కలిసి దాడికి యత్నించాడు. ఈ ఘటన ఆత్మకూర్(ఎస్) మండలం గట్టికల్ గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా.. గ్రామానికి చెందిన సామ తిరుమల్‌రెడ్డికి అదే ఊళ్లోని బండగొర్ల వెంకన్నకు కొంతకాలంగా భూ వివాదాలు ఉన్నాయి. గతంలో వెంకన్నకు మద్దతుగా నిలిచిన జానయ్య ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రాత్రి గట్టికల్ గ్రామానికి వచ్చారు. జానయ్య ప్రసంగిస్తుండగా తిరుమల్‌రెడ్డి వచ్చి దుర్భాషలాడుతూ నీ వల్ల నా భార్యాపిల్లలు ఇబ్బందులు పడ్డారంటూ ఆగ్రహంతో ఊగిపోయాడు. ప్రసంగానికి అడ్డుతగిలాడు. జానయ్య అనుచరులు, గ్రామస్తులు తిరుమల్‌రెడ్డిని ఆపే ప్రయత్నంలో ఆయన కిందపడిపోయాడు. దీంతో తీవ్ర ఆవేశంతో తిరుమల్‌రెడ్డి తన ఇంట్లోకి వెళ్లి గొడ్డలి తీసుకువచ్చాడు. ఆయన కుమారులు రాజశేఖర్‌రెడ్డి, అఖిల్‌రెడ్డి సైతం కర్రలతో వచ్చి వీరంగం సృష్టించారు. జానయ్యపై కర్రతో దాడి చేయబోగా ఆయన అనుచరుడు చింత రమేష్ అడ్డురావడంతో రమేష్‌కు గాయాలయ్యాయి. జానయ్య అనుచరులు వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా అక్కడి నుంచి పరారయ్యారు. కాగా

తనపై దాడికి ప్రయత్నించిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ జానయ్య తన అనుచరులతో కలిసి రోడ్డుపై బైఠాయించారు. తిరుమల్‌రెడ్డి అతడి ఇద్దరు కుమారులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

జిల్లా వార్తలు

27న కృత్తికా దీపోత్సవం

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈనెల 27న కృత్తికా దీపోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతాయి. కాగా, కృత్తికా దీపోత్సవం సందర్భంగా బేడా మండపంలో ప్రతిరోజు జరిగే స్వామి వారి కల్యాణాన్ని 27న నిలిపివేస్తున్నట్లు ఆలయ ఈఓ రమాదేవి తెలిపారు.

సింగరేణి కల్చరల్ మీట్‌లో సత్తా



బహుమతులు అందుకున్న కార్మిక కళాకారులు

మణుగూరు రూరల్: బెల్లంపల్లిలో ఇటీవల రెండు రోజుల పాటు జరిగిన సింగరేణి స్థాయి కల్చరల్ మీట్‌లో మణుగూరు ఏరియా కార్మిక కళాకారులు సత్తా చాటారు. కల్చరల్ మీట్‌లో ఎస్‌సీహెచ్.పవన్ ఆర్కెస్ట్రా బృందం ప్రథమ బహుమతి సాధించింది. అలాగే, కెప్టెన్ డేవిడ్ రాజుతో పాటు సభ్యులు పి.ఏసోబు, పి.నరసయ్య, జె.శ్రీనివాస్, పి.హరినాథ్, డి.ప్రవీణ్, వినయ్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి కోలిండియా స్థాయి మీట్‌కు ఎంపికయ్యారు. ఇక కర్ణాటక సంగీతం సోలో విభాగంలో ఎస్‌సీహెచ్.పవన్‌కుమార్ ప్రథమ, మనోహర్ బృందం ఖవ్వాలీలో ద్వితీయ, ఫ్లూట్ విభాగంలో పి.నరసయ్య ద్వితీయ స్థానాల్లో నిలిచారు.

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం



దాతకు రశీదు ఇస్తున్న ఆలయ సిబ్బంది

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఆదివారం ఏపీకి చెందిన భక్తుడు విరాళం అందజేశారు. అనంతపురం జిల్లాకు చెందిన సురేంద్రబాబు రూ.లక్ష చెక్కును ఆలయ అధికారులకు అందజేశాక కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ఉద్యోగి సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలే సీపీఎం ఎన్నికల ఎజెండా

- కొత్తగూడెంలో సీపీఐకి మద్దతు
- సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు విజయ్ రాఘవన్



మాట్లాడుతున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు విజయ్ రాఘవన్, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజాసమస్యల పరిష్కారమే ఎజెండాగా సీపీఎం ఎన్నికల్లో పోటీ చేస్తోందని ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ ఎంపీ విజయ్ రాఘవన్ వెల్లడించారు. ఖమ్మంలోని సుందరయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో తాము బలంగా ఉన్న 19 స్థానాల్లో పోటీ చేస్తుండగా, సీపీఐకి కొత్తగూడెం స్థానంలో మద్దతు ఇస్తున్నామని తెలిపారు. చట్టసభల్లో కమ్యూనిస్టులు ఉండాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. కాగా, ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలు ఇస్తూ బీజేపీ రాజ్యాంగేతరశక్తిగా మారిందని మండిపడ్డారు. బీజేపీ పాలనలో దళితులు, కార్మికులు, కర్షకులపై భారం మోపారని, ప్రతీ వర్గం సంకటస్థితిని ఎదుర్కొంటోందని తెలిపారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు బి.వెంకట్ మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో ప్రత్యామ్నాయం అందుబాటులోకి రావాల్సిన అవసరముందని చెప్పారు. ఈ ఎన్నికలు జాతీయ స్థాయిలో ప్రభావితం చేసే అవకాశమున్నందున కమ్యూనిస్టులు పోటీ చేస్తున్న 20 స్థానాల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ను ఓడించాలని ఆయన కోరారు. తెలంగాణలో 17శాతం ఉన్న దళితుల్లో 60 శాతం మందికి భూమి లేకపోగా, మౌలిక సమస్యల పరిష్కారంపై పాలకులకు చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. బీజేపీ బీసీ ముఖ్యమంత్రి నినాదాన్ని ఎత్తుకున్నా... బీసీల సమస్యలపై ఆ పార్టీకి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఇక ముస్లింల ఓట్ల కోసం ఆరాటం తప్ప అంతర్జాతీయంగా ముస్లింలపై దాడులు జరుగుతున్నా కమ్యూనిస్టులు తప్ప ఏ పార్టీ స్పందించడం లేదని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎం.సాయిబాబు, నాయకులు జె.వెంకటేశ్, నున్నా నాగేశ్వరరావు, వై.విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

కళలను ప్రోత్సహిస్తున్న కళాక్షేత్రం

ఖమ్మం కలెక్టర్ వీ.పీ.గౌతమ్



కళాకారులకు దుస్తులు అందజేస్తున్న కలెక్టర్ గౌతమ్, కళా పరిషత్ అధ్యక్షుడు రవి



కొత్త తరం కొడుకులు నాటికను ప్రదర్శిస్తున్న కళాకారులు

ఖమ్మంగాంధీచౌక్: కళలు, కళాకారులకు ఖమ్మం కళాక్షేత్రం నిలయంగా నిలుస్తోందని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. ఖమ్మంలోని భక్త రాందాసు కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన 76వ నెలనెలా వెన్నెల కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఖమ్మంలోని భక్త రాందాసు కళాక్షేత్రం వివిధ రకాల కళలకు వేదికగా ఉందని తెలిపారు. నెలనెలా వెన్నెల ద్వారా కళాకారులను ప్రోత్సహించటం అభినందనీయమన్నారు. ఇక్కడ ప్రదర్శిస్తున్న కార్యక్రమాలు సమాజాన్ని చైతన్యపర్చేవిగా ఉంటున్నాయని పేర్కొన్నారు. ఈమేరకు ప్రజలు కూడా కళలు, కళాకారులను ఆదరించాలని కోరారు. అనంతరం ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షుడు డాక్టర్ నాగబత్తిని రవి సతీమణి మాలతి స్మృత్యర్థం 142 మంది కళాకారులకు కలెక్టర్ చేతుల మీదుగా దుస్తులు అందజేశారు. అలాగే, కొత్త తరం కొడుకులు నాటిక నిర్వాహకులకు పారితోషికం అందజేయగా, డాక్టర్ కావ్యచంద్ యలమూడి, మీనాను అభినందించారు. తొలుత తొలితరం తెలంగాణ ఉద్యమకారుడు అన్నబత్తుల రవీంద్రనాథ్, ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షుడు డాక్టర్ నాగబత్తిని రవి సతీమణి మాలతి చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ అజీజ్, మోత్కూరి గోపాల్‌రావు, సమ్మయ్య, జనార్దన్‌రావు, అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ(ఆర్క్స్) అధ్యక్ష, కార్యదర్శులు మోటమర్రి జగన్మోహన్‌రావు, ఏఎస్.కుమార్, ఖమ్మం కళా పరిషత్ గౌరవ అధ్యక్షుడు వీ.వీ.అప్పారావు, కార్యదర్శి విజేత, ప్రజా నాట్యమండలి అధ్యక్ష, కార్యదర్శులు నామా లక్ష్మీనారాయణ, వేముల సదానందం తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కొత్తతరం కొడుకులు

నెలనెలా వెన్నెల కార్యక్రమంలో భాగంగా కొండెవరం మణికంఠ ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన 'కొత్త తరం కొడుకులు' నాటిక ప్రేక్షకులను అలరించింది. ఆర్థికి మాత్రమే వారసులుగా ఉంటూ, తల్లిదండ్రుల బాధ్యత విషయంలో పట్ల అమానవీయంగా వ్యవహరించిన కొడుకులే ఇతివృత్తంగా ఈ నాటికను ప్రదర్శించారు. ఈ నాటికను రావు కృష్ణారావు రచించగా, చెలికాలని వెంకట్రావు దర్శకత్వం వహించారు.

హైదరాబాద్ జిల్లా జడ్జిగా భద్రాద్రి వాసి



తల్లిని సన్మానిస్తున్న న్యాయమూర్తి వెంకటేశ్వరరావు

భద్రాచలంఅర్బన్: వరంగల్‌లో సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న మండా వెంకటేశ్వరరావు హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో జిల్లా జడ్జిగా ఇటీవల పదోన్నతిపై బాధ్యతలు స్వీకరించారు. భద్రాచలానికి చెందిన ఆయనను భద్రాచలం బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ వెంకటేశ్వరరావు భద్రాచలంలో పుట్టి పెరిగి న్యాయవృత్తిని స్వీకరించాక అంచెలంచెలుగా ఎదిగారని కొనియాడారు. అనంతరం వెంకటేశ్వరరావు తన తల్లిని సన్మానించి మాట్లాడుతూ తల్లి స్ఫూర్తితోనే తాను ఈ స్థాయికి చేరుకున్నానని తెలిపారు. భద్రాచలం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జడ్జి వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి భువనగిరి దేవరపల్లి నాగేశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట దేవదానంతోపాటు న్యాయవాదులు కృష్ణమాచారి, కృష్ణకుమార్, పీవీ.రమణరావు, కొలిచిన నవీన్, ముత్యాల కిషోర్, గుడపర్తి నాగరాజు, కొడాలి శ్రీనివాస్, అక్తర్, సల్మాన్‌రాజ్, రాము, కృష్ణకుమారి, అరుణశ్రీ, సంధ్య, అంజలి, సాధనపల్లి సతీష్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత సమాజ నిర్మాణం జరగాలి

- మానవ చరిత్ర విలువలతో కూడినది..
- తెలంగాణ పీపుల్స్ జేఏసీ సదస్సులో ప్రొఫెసర్ హరగోపాల్



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

ఖమ్మంవన్‌టౌన్: మానవ చరిత్ర విలువలతో కూడుకున్నదని.. విలువల వ్యవస్థీకరణ జరిగినప్పుడే మెరుగైన సమాజం ఆవిష్కృతమవుతుందని ప్రొఫెసర్ హరగోపాల్ అభిప్రాయపడ్డారు. తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యాన ఖమ్మంలో ఆదివారం 'అసెంబ్లీ ఎన్నికలు – మన కర్తవ్యం' అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన హరగోపాల్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనేవి ఎక్కడా అమలు జరగడం లేదన్నారు. యాభై ఏళ్లుగా అధ్యాపక వృత్తిలో ఉంటూ తెలంగాణ సమాజంతో మమేకమై అనేక ఉద్యమాల్లో పాల్గొన్న తాను ఎన్నడూ ఇంతటి నిర్బంధం, అణచివేతను చూడలేదని తెలిపారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో విద్యా, వైద్య వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని, తెలంగాణ వస్తే కొలువులు లభిస్తాయని నిరుద్యోగులు ఆశపడితే ప్రభుత్వం పరీక్షలు నిర్వహణలో విఫలమైందని ఆరోపించారు.

అలాగే, సీఎం కేసీఆర్ చెబుతున్న కేజీ నుండి పీజీ ఉచిత నిర్బంధ విద్య ఎక్కడా అమలుకావడం లేదన్నారు. మరోపక్క కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూనివర్సిటీలను ధ్వంసం చేశాయని తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం కేంద్రం చేసిన నోట్లరద్దు, జీఎస్టీ, రైతుల నల్లచట్టాలకు మద్దతు ఇవ్వడమేకాక తెలంగాణ సంస్కృతిని సైతం కాపాడేలా చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశం, రాష్ట్రంలో ఫాసిస్టు పరిపాలన కొనసాగుతుందని ఆయన తెలిపారు. పోలీసులతో రాజ్యం నడుపుతున్న పాలకులు ఆ శాఖలో తప్ప ఎక్కడా కొలువులు ఇవ్వలేదన్నారు. అనంతరం సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, సుప్రీంకోర్టు న్యాయవాది నిరూప్ మాట్లాడుతూ ధరణి పేరుతో లాండ్ మాఫియా విజృంభించిందని చెప్పారు. ప్రతీ నియోజకవర్గంలో ఎమ్మెల్యేలు అక్రమార్జనతో రూ.వందల కోట్లకు పడగలెత్తారని విమర్శించారు. కేసీఆర్ ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలుకాకపోగా, ఉద్యకారులకు కేసులు, పాలకులకు సూట్‌కేసులు వచ్చాయని తెలిపారు. మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణను బీఆర్‌ఎస్ చేతిలో పెడితే పదేళ్లలో రూ.లక్షల కోట్ల అప్పును ప్రజల నెత్తిన విషయాన్ని గుర్తించి వచ్చే ఎన్నికల్లో ప్రజాహిత కార్యక్రమాలు చేసేవారిని ఎన్నుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వనమాల, కొండల్‌రెడ్డి, కరుణాకర్ దేశాయి, స్వర్ణ భాస్కర్, ఐ.వీ.రమణారావు, డాక్టర్ కే.వీ.కృష్ణారావు, గుంతేటి వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

'మిస్ట్' విద్యార్థుల 24 గంటల హాకథాన్



హాకథాన్‌లో పాల్గొన్న విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల(మిస్ట్) విద్యార్థులు 24 గంటలు ఏకధాటిగా హాకథాన్ నిర్వహించి సత్తా చాటారు. కళాశాలకు చెందిన సీఎస్సీ విభాగం విద్యార్థులు ఏఐసీ టీఈ గుర్తింపు పొందిన బ్రెయినోవిజన్ ప్రైవేట్ లిమిటెడ్–ఇండియా పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారని ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ తెలిపా రు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే హాకథాన్ నిర్వహించిన మొదటి కళాశాలగా గుర్తింపు సాధించామని చెప్పారు. 24గంటల హాకథాన్‌లో భాగంగా 22 గ్రూపులుగా పాల్గొన్న విద్యార్థులు సమాజానికి ఉపయోగపడేలా 22వెబ్‌సైట్లను రూపొందించారని తెలిపారు. అనంతరం మొదటి, రెండు స్థానాల్లో నిలిచిన గ్రూప్‌లకు బ్రెయినో విజన్ కంపెనీ బాధ్యులు బహుమతులు అందజేయగా, పదిమంది విద్యార్థులను నెలనెలా రూ.10 వేల ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక చేశారు. కాగా, విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, చైర్మన్ కంచర్ల సత్యనారాయణ, డీన్లు డాక్టర్ జాకీర్ హుస్సేన్, ఎం.వీ.రామచంద్రరావు, బీఎస్‌వీ.మధుబాబు అభినందించారు.